# గొలుసు కట్టు

జీవితంలో లొసుగుల వెనక ముసుగు లేమిటి? కనబడని గొలుసులు తెగేదెప్పుడు?

ఒక నలభై ఐయిదేళ్ళ గృహిణి అంగలార్చుకుంటూ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కి వచ్చింది.

"ఎస్సైగారూ! ఎస్సైగారూ! నిన్నరాత్రి మాయింట్లో దొంగలు పడి, బీరునా బద్దలు కొట్టి మూప్పై తులాల బంగారు ఆభరణాలు దోచేశారండీ! తమరెలాగైనా దొంగల్ని పట్టి వస్తువులు మాకిప్పించండి బాబూ! మీకు పుణ్యం ఉంటుంది" అంటూ గుండెలు బాదుకుంటూ భోరున ఏడుస్తూంది.

"అమ్మా! ఏడుపాపండి. మీ యింటికి తక్షణమే మా హేడ్డుని పంపించి దొంగతనం ఎలా జరిగిందో పరిశోధన గావిస్తాం" అంటూ ఆమెనోదార్చి, హేడ్డుని పంపించాడు "ఎస్సైగారు.

"హేడ్డుగారొచ్చి ఇల్లంతా నిశితంగా పరిశీలించారు. దొంగలు కిటికీ ఊచల్ని ఏ విధంగా వంచి, ఆమెను వంచించారో గమనించారు. యజమానురాల్ని అడిగి ఆభరణాల వివరాలు రాసుకున్నారు.

చంద్రహారాల గొలుసు పది తులాలు.

గాజులు ఐదు తులాలు

ఒడ్డాణం పదిహేను తులాలు

"అంటే మొత్తం ముప్పయ్ తులాల వస్తువులు పోయాయన్న మాట?" అడిగేరు హేడ్డుగారు.

"ఔను బాబూ!"

"నాకు తెలియకడుగుతానూ! మీవారేం చేస్తుంటారు?"

"భిలాయ్ స్టీల్ ప్లాంట్‌లో స్టెనోగా పని చేస్తున్నారు బాబూ? నేనిక్కడ పిల్లల్ని పెట్టుకుని చదివించుకుంటున్నాను."

"మీకెంతమంది పిల్లలమ్మా?"

"నలుగురు బాబూ! అంతా ఆడపిల్లలేనండీ!"

"మీ వారెన్నాళ్ల నుంచి ఉద్యోగం చేస్తున్నారు?"

"ఓ ఇరవై ఏళ్ళ నుంచండి బాబూ!"

"ఇరవై ఏళ్ల నుంచి పని చేస్తూ, ఆయనక్కడ - మీరిక్కడ - నలుగురాడపిల్లలు చదువులు, స్కూలు యూనిఫారాలు, పంజాబీ డ్రస్సులు, నాలుగు సైకిళ్లూ, బోల్డు ఫర్నిచరు, గాస్ పొయ్యి, ప్రెషర్ కుక్కరూ, ముప్ఫయ్ తులాల బంగారం - ఇవన్నీ మీవారి జీతంతోనే సంపాదించారంటే, ఎవరు నమ్ముతారు?"

"బంగారం మా పుట్టింటారు బాల తొడుగు పెట్టేరండీ!"

"అయితే మీపుట్టింటికెళ్లి మీ పుట్టింటారి ఆస్తి పాస్తులేమిటో దర్యాప్తు చేయాలి. భిలాయ్ వెళ్లి మీవారి జీతభత్యాలు - అక్కడ ఆయనకయే ఖర్చులు - ఇక్కడ మీకయే ఖర్చులు - ఇవన్నీ లెఖ్ఖ తేల్చాలి!" అన్నారు హేడ్డుగారు.

"బాబూ హేడ్డుగారూ! ఈ తతంగం అంతా బోల్డు ఆలస్యమవుతుంది. ఇలా అయితే నా బంగారం నేనీ జన్మలో కానను! తమర్కి ఈ చిరుకానుక సమర్పించుకుంటాను - త్వరగా తేల్చండి బాబూ!" అంటూ మహాత్ముని బొమ్మ వున్న ఐదు వందల రూపాయల నోటు హేడ్డుగారి జేబులో కుక్కింది.

హేడ్డుగారి మొహంలో సూర్యోదయమైంది!

అహింసావాది, సత్యసంధుడు అయిన మహాత్ముడు నోటు మీంచి హేడ్డును చూసి, హెడ్డుదించుకున్నాడు!

"సరే ఒకటి రెండు నెలల్లో దొంగను పట్టి మీ వస్తువులు మీకప్పజెప్తాం - కాదు ప్రయత్నిస్తాం" అన్నారు హేడ్డుగారు.

హేడ్డుగారు పోలీస్‌స్టేషన్ కొచ్చి ఇన్‌స్పెక్టరు గారితో జరిగిందంతా చెప్పి ఎఫ్.ఐ.ఆర్. రాయబోయారు.

"నీకేమైనా హెడ్డుందా హేడ్డూ? మొత్తం ముప్పయ్ తులాలు మనం ఎఫ్.ఐ.ఆర్.లో రాసెస్తే మనకేటి మిగుల్తాది? పదిహేను తులాలు రాయిచాలు" అన్నారు ఎస్సైగారు.

"చిత్తం" అన్నాడు హేడ్డు.

రెణ్ణెల్లు పోయేక హేడ్డుగారు ఆ గృహిణి ఇంటికొచ్చి "అమ్మా! మీ బంగారం దొరికింది. కాని పదిహేను తులాలే దక్కింది. అదైనా కరిగించేసిన ముద్ద! ఇది మీరు తీసుకుని, మేము చెప్పిన విధంగా వస్తువులు చేయించండి - లేకపోతే ఇది కూడా దక్కదు" హెచ్చరించాడు హేడ్డు.

పోనీ ఏం దొరికితే అదే దక్కుడు - మొదటికే మోసం అవకుండా సహం బంగారమైనా దక్కుతుంది కదా అని - "అలాగే బాబూ"! అని ఒప్పేసుకుంది గృహిణి.

"వస్తువులెలా చేయించాలో తెలుసా? పది పేటల చంద్రహారాల బదులు - ఐదు పేటలే - అంటే ఐదు తులాలే చేయించాలి. గాజులు ఐదు తులాలు బదులు రెండున్నర తులాలే చేయించాలి. ఒడ్డాణం పదిహేను తులాల బదులు ఏడున్నర తులాలే చేయించాలి."

"అక్షరాల అలాగే చేయిస్తాను బాబూ!"

"ఆ ! వారంలోగా చేయించేసి మళ్లీ మాకే ఇచ్చేయండి. ఆ వస్తువులతో పాటు దొంగని కూడా కోర్టులో హాజరు పరచాలి!" అన్నాడు హేడ్డు.

"అలాగే బాబూ!"అంది గృహిణి.

వారం రోజులు పోయేక హేడ్డు చెప్పినట్టే వస్తువులన్నీ తయారు చేయించి హేడ్డుగారికి అందించింది గృహిణి.

కోర్టులో దొంగనీ, దొరికిన వస్తువుల్నీ హాజరు పరిచారు పోలీసులు. గృహిణి కూడా వెళ్లి తన వస్తువుల్ని గుర్తు పట్టింది. రెండు మూడు వాయిదాలు పడ్డాక, ఆ గృహిణికి పదిహేను తులాల బంగారు ఆభణాలు కోర్టు ద్వారా దక్కేయి.

"హమ్మయ్య!" అనుకుంది గృహిణి - గుండె మీద చెయ్యి వేసుకుని - "నా పదిహేను తులాలు నాకు దక్కేయి. మొదటే నేను పోగొట్టుకున్న ఆభరణాలు పదిహేను తులాలని ఫిర్యాదు చేసివుంటే, నాకు దక్కేవి ఏడున్నర తులాలే కదా?"

ఫ్లాష్ బ్యాక్ -

పోలీసులు దొంగను పట్టుకుని - "రేయ్ కేడీ యెదవా! ఆ దొంగ బంగారం ఎవరికమ్మేవో సెప్పరా?" అంటూ బంగారం కొట్టుని చూపించమని నాలుగు లాఠీ దెబ్బలు కొట్టేరు.

"ఈయనకే బాబూ!" అని ఆ పెద్ద బంగారం కొట్టుని చూపించేడు ఆ కేడీగాడు.

పోలీసులు వెంటనే ఆ బంగారం వ్యాపారిని పట్టుకుని కొట్లో పడేశారు.

"నేనే దొంగ బంగారం కొనలేదు బాబూ! అంతా అబద్ధం!" అని మొర పెట్టుకున్నాడు వ్యాపారి.

"ఆ విషయం కోర్టులో చెబుదువుగాని" అన్నారు పోలీసులు.

బంగారు వర్తకుల యూనియన్ నాయకుడు జోక్యం చేసుకుని ముప్ఫయ్ దుకాణాల్లోనూ ముప్ఫయ్ తులాల బంగారాన్ని సేకరించి పోలీసులకు సమర్పించుకున్నాడు. అందులో పోలీసులు, తమ వాటా కింద పదిహేను తులాలు ఉంచేసుకుని - మిగిలిన పదిహేను తులాలు - ఆభరణాలు పోగొట్టుకున్న గృహిణికి యిచ్చేశారు కోర్టు ద్వారా.

గప్‌చిప్‌గా 'లాకప్పు'లో వున్న వర్తకుడు 'ఇంటికప్పు'కిందికి చేరుకున్నాడు.

శ్రావణ మాసంలో అత్తారిల్లలో కొత్తకోడళ్లు రెండో శుక్రవారం జరుపుకునే వరలక్ష్మీ వ్రతానికి చేయించుకునే ఆభరణాలు చేయించుకునేటప్పుడు - అందులో తెగ్గొట్టిన బంగారు ముక్కలలో, తాము పోగొట్టుకున్న ముప్ఫయ్ తులాల బంగారాన్ని భర్తీ చేసుకున్నారు బంగారు వర్తకులు!

ప్రభుత్వాలు -

వర్తకులు ఉత్పత్తి చేసే సరుకులు మీద, అమ్మే వివిధ వస్తువుల మీద ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పన్నులు విధించడం, ఆ సరుకుల ధరలు పెంచి వర్తకులు ప్రజల మీద ఆ పన్నులు 'విధిం'చడం, ఆపన్నులైన ప్రజల్ని ఆదుకునే వారు లేక ఆపన్నుల్ని 'విధి'గా చెల్లించడం - ఆ పన్నుల భారం మోయలేక ప్రజలు అక్రమ లావాదేవీలకు పాల్పడటం - ఇదంతా ఓ గొలుసుకట్టు!

ఈ గొలుసు తెగేదెలాగో? ఎప్పుడో?



ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 27-6-97